సిద్దయ్య లేచి తూలుకుంటూ తూలుకుంటూ నూతి దగ్గరకెళ్లి ఓ చేదడు నీళ్లతో కాకిస్నానం చేసేసి తిరిగొచ్చేడు. అప్పటికీ అంజిగాడు లేవకపోవడం చూసి లాగి పిర్రమీద ఒక్కటంటించేడు. నిద్దట్లో ఉన్న అంజిగాడు తుళ్లిపడి లేచి తల్లిని వాటేసుకున్నాడు. అరున్నొక్క శృతిలో ఏడుపు రాగం అందుకున్నాడు. అంజిగాడి రాగం విని కోతి కిచకిచమని గెంతి తన సానుభూతిని చూపించడం మొదలెట్టింది.

"ఏడ్డం తప్ప ఇంకేటీ రాదు ఈనాకొడుక్కి" అని విసుక్కున్నాడు సిద్దయ్య.

"ఏటయ్యా, కుర్రోడి మీద పట్టించేవు? వోరం రోజుల్నుంచి తిండీ తిప్పలూ లేకుండా ఉత్తి గెంజినీల్లతో బతుకుతున్నాడు బిడ్డ. ఆణ్ణెందుకు లేపేవు" అని కసురుకుంది ఈరి.

భూమి నుంచి రెండడుగులైనా లేని కొడుకు కోతి పక్కన కోతిలా కన్పించడం చూసి దిగులుగా నిట్టూర్చింది.

"ఛెయ్, ఏడుపాపు ఎదవా" అని గద్దించేడు సిద్దయ్య. అంజిగాడు అదిరిపడి రాగం ఆపేసేడు. "ఛూ నీయయ్య, సూసి సూసి కోతినా కొడుకుని కన్నావు కదే, ఈడికి పదారేళ్లు ముడ్డికింద కొచ్చేయంటే ఎవడైనా నమ్ముతాడా అసలు?" అన్నాడు సిద్దయ్య.

"సాల్లే, నీ తాగుబోతు మొకానికి ఇంతకన్నా అందవైన కొడుకు పుట్టేత్తాడేటి? తెల్లారిలేత్తే నీ మొకం, నువ్వాడించీ కోతి మొకవే కదా దర్సినాలు. ఇంకేటవుద్దిమరి!" అని తిప్పి కొట్టింది ఈరి.

వేడివేడి అన్నం వండిపెట్టి, కారం కారం పచ్చళ్లు నూరిపెట్టి, వొర్రొర్రగా ఎండుచేపల పులుసు లొండిపెట్టి మూడురోజులుగా ఒకటే హైరానా పడుతోంది ఈరి.

శివరాత్రి తీర్థానికి పట్టిసీమ వెళ్లొచ్చేడు సిద్దయ్య. తీర్థంలో కోతిని ఆడించి డబ్బులు బాగానే గడించి ఉంటాడని, వాటి నెలాగైనా లాక్కోకపోతే మొత్తం అంతా తాగుడికే ఖర్చు చేసేస్తాడని ఈరి తాపత్రయం. ఎప్పుడూ అంజిగాణ్ణి తీసుకుని తనూ వెంట వెళ్లేది. ఈ సారి అంజిగాడికి అపరిమితమైన జ్వరం కాయడంతో వెళ్లలేకపోయింది. వచ్చినప్పట్నుంచి ఏ పూట భత్యం ఆ పూట ఇస్తున్నాడు తప్ప డబ్బులు బైటపడనివ్వడం లేదు సిద్దయ్య. ఆ డబ్బుల దన్ను చూసుకుని కోతినాడించడానికి కూడా వెళ్లడం లేదు. పగలూ రాత్రీ తాగి జోగుతున్నాడు.

గిన్నెనిండా అన్నం వడ్డించి, దానిపైన పచ్చడి వేసి "మావా, ఉప్పు సేప ముక్కేవైనా కాల్చమంటావేటి?" అనడిగింది.

తాగింది బాగా తలకెక్కి ఉన్నాడు సిద్దయ్య. గిన్నెని పరిశీలనగా చూసి ఒక్క తాపు తన్నేడు. ఒంగినదాన్ని ఒంగినట్టే జుట్టు పట్టుకుని వీపుమీద గుభీగుభీమని రెండు గుద్దులు గుద్దేడు.



కథా నిలయం
శ్రీకాకుళం

